

విత్తన వడ్లకు రెక్కలు

కేసీ ఆయకట్టు రైతులు నారుకు సిద్ధమయ్యారు. దీంతో విత్తన వడ్లకు డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా కంపెనీలు ధరలు పెంచి రైతుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నాయి. - 8లో



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహించిన ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. చివరి మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /21.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.8 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

జిల్లాకు 350 మెట్రిక్ టన్నుల డీఏపీ రాక

– జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు సర్దుబాటు



రైలు వ్యాగన్ నుంచి లారీలకు ఎక్కిస్తున్న డీఏపీని పరిశీలిస్తున్న గోవర్ధన్

కడప అగ్రికల్చర్ : పీపీఎస్ కంపెనీకి చెందిన 350 మెట్రిక్ టన్నుల డీఏపీ సోమవారం జిల్లాకు వచ్చిందని జిల్లా వ్యవసాయ కార్యాలయం వ్యవసాయ అధికారి గోవర్ధన్ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు ఉత్తర్వుల మేరకు జిల్లావ్యాప్తంగా అవసరమైన మేరకు ఆయా రైతు సేవా కేంద్రాలకు సర్దుబాటు చేసి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఎవరు డీఏపీకి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారులు తెలిపారు.

21న జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల21న కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్లు, సీఎన్‌సీ ఆపరేటర్లు, హెచ్‌డీఎఫ్‌సీలో ఎగ్జిక్యూటివ్స్, నవ భారత్ కంపెనీలో సేల్స్ అసోసియేషన్, ముత్తూట్ ఫైనాన్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు, డిక్సన్ కంపెనీలో మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18-30 సంవత్సరాల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7-20 వేల వరకు వేతనం ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.


రేపు 'డయల్ యువర్ ఆర్ఎం'

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నిమిత్తం ఈనెల 21వ తేది డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను 99592 25848 నెంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా గానీ తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

25న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 25న ఆదివారం ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలను నిర్వహించనున్నట్లు బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మద్ బాషా, జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు వీరకళ్యాణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16 సంవత్సరాలలోపు బాలబాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను సెప్టెంబరు 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9949686586, 8019880995 నంబరులకు సంప్రదించాలని కోరారు.

రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థినికి గోల్డ్‌మెడల్



పతకం, ప్రశంసా పత్రంతో మౌనిక

కురబలకోట : మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. మౌనిక రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ప్రథమ బహుమతి సాధించడంతో పాటు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ కర్నూలులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల మౌనికను అభినందించారు.

నీరు చూసి.. నారు పోసి

- కేసీకి నీరు రాకతో నారుమళ్ల సాగులో అన్నదాతలు బిజీ
- జిల్లాలో ఇతర ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో జోరుగా నాట్లు



పచ్చగా కళకళలాడుతున్న నారుమడి (ఇన్‌సెట్) వరి నాట్లలో కూలీలు

కడప అగ్రికల్చర్ : కేసీ కాలువ పరిధిలో ఈ సారి వరి పైరు ఆలస్యంగా మొదలైంది. జిల్లాలో ఇతర నదీ పరివాహక ప్రాంతాలు, ప్రాజెక్టుల పరిధిలోని రైతులు ఇప్పటికే నాట్లలో మునిగితేలుతుండగా.. కేసీ ఆయకట్టు రైతులు ఇంకా నారు వేయడంలోనే నిమగ్నమై ఉన్నారు. జిల్లావ్యాప్తంగా కేసీ కాలువ పరిధిలో 92 వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణం ఉంది. ఇక బోరుబావుల కింద ముందుగా నారుమడులు సాగు చేసుకున్న రైతులు అక్కడక్కడ వరినాట్లు చేపట్టగా .. మిగతా రైతులు కేసీకి నీళ్లొచ్చేదాకా నారు జోలికే పోలేదు. ఇక నదీ పరీవాహక, ప్రాజెక్టుల పరిధిలో మాత్రం నాట్లు ముమ్మరంగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరి సాధారణ సాగు 31,171 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 6,614 ఎకరాల్లో వరి సాగు చేశారు.

జిల్లాలోని ప్రాజెక్టు పరిధిలో...

జిల్లాలోని ప్రాజెక్టుల పరిధిలో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. ఇందులో భాగంగా కొండాపురం మండలంలో సాధారణసాగు 390.2 హెక్టార్లకుగాను ఇప్పటి వరకు 143 హెక్టార్లలో, బి.మఠంలో 1498.4 హెక్టార్లకుగాను 450, కలసపాడులో 868 హెక్టార్లకు గాను 185, పోరుమామిళ్లలో 964 హెక్టార్లకు గాను 194, బి.కోడూరులో 962 హెక్టార్లకుగాను 220 హెక్టార్లలో వరిసాగయింది.

నదీ పరివాహక ప్రాంతాల పరిధిలో...

జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించి కూడా నాట్లు సాగుతున్నాయి. ఇందులో భాగంగా రాజుపాలెంలో 808 హెక్టార్లకుగాను 105 హెక్టార్లలో, ప్రొద్దుటూరు 1546 హెక్టార్లకుగాను 250, జమ్మలమడుగు 1062 హెక్టార్లకుగాను 394, కమలాపురంలో 343 హెక్టార్లకుగాను 261.84, వల్లూరు 973హెక్టార్లకు గాను 474, చెన్నూరు 1229 హెక్టార్లకుగాను 508 , వేంపల్లి 451 హెక్టార్లకుగాను 450, చక్రాయపేట 1052 హెక్టార్లకుగాను 479, సిద్దవటం 932 హెక్టార్లకు గాను 768, ఒంటిమిట్టలో 269 హెక్టార్లకుగాను 120 హెక్టార్లలో వరిపంట సాగయింది.

కేసీ కాలువ కింద అంతంత మాత్రంగానే..

జిల్లాలోని కేసీ కాలువకు ఈ సారి నీరు రాక ఆలస్యమైంది. దీంతో కేసీ పరిధిలోని మండలాల్లో వరి నాట్లు సాగు అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇందులో భాగంగా దువ్వూరు మండలంలో సాధారణ సాగు 2999 హెక్టార్లు ఉంటే ఇప్పటికి ఒక ఎకరాలో కూడా వరిపంటను సాగు చేయలేదు. అలాగే మైదుకూరు మండలంలో 1224.8 హెక్టార్లగాను ఒక ఎకరాలో కూడా వరినాటు పడలేదు. అలాగే ఖాజీపేట మండలంలో 3339.8 హెక్టార్లగాను 152 హెక్టార్లలో రాజుపాలెంలో 808 హెక్టార్లకు గాను 105 హెక్టార్లలో వరిపంట సాగయింది. ఇటీవలే చాలా మంది రైతులు నారుమడులను సాగు చేశారు. సెప్టెంబర్ మొదట, రెండో వారల్లో కేసీ కాలువ పరిధిలో వరినాట్లు సాగు ముమ్మరంగా కానుంది.

కేసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టు వివరాలు ఇలా...

మండలం	ఆయకట్టు (హెక్టార్లలో)
దువ్వూరు	10,419.28
చాపాడు	20,894.48
మైదుకూరు	3,553.23
ఖాజీపేట	20,804.82
రాజుపాలెం	6,894.24
ప్రొద్దుటూరు	5,427.50
కడప	5,371.83
చెన్నూరు	8,200.34
వల్లూరు	406.88
సికెదిన్నె	121.12
పెద్దముడియం	9,063.0
చాగలమర్రి	643.29
మొత్తం కేసీ ఆయకట్టు	92,937.01

నారు సాగు చేశాను...



ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో కేసీ కాలువకు రెండు వారాల క్రితమే నీటిని వదిలారు. నీరు వచ్చిన తర్వాతే మేము నారు మడులను సాగు చేసుకుంటాం. ఈ మధ్యే నేను కూడా వరిమడి సాగు చేశాను. - శ్రీనివాసులు, రైతు, పాటిమీదిపల్లె, ఖాజీపేట మండలం

లక్ష్యానికి మంచి సాగయ్యే అవకాశం ఉంది...

ఈ ఏడాది వరిపంట లక్ష్యానికి మంచి సాగయ్యే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో కేసీ కాలువకు ఇటీవలే నీరు విడుదల చేశారు. ఇక కేసీ పరిధిలోని రైతులందరూ ముమ్మరంగా వరిమడులను సాగు చేసుకుంటున్నారు. మరో వారం పదిరోజుల్లో వరినాట్లసాగు ముమ్మరం కానుంది. - అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

పోస్టర్ విడుదల

కడప అగ్రికల్చర్ : పశువులకు జబ్బులు సోకకుండా ప్రతి రైతు తప్పని సరిగా టీకాలను వేయించాలని కలెక్టర్ లోతోటి శివశంకర్ సూచించారు. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లా వ్యాధి టీకా నివారణ ప్రోగ్రాంకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పశుసంవర్ధశాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ గాలికుంట వ్యాధి లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ టీకా కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ రమణయ్య, ఏడీ రాజశేఖర్, డాకర్లు అనుపమ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : శ్రావణ మాసంలో భాగంగా సోమవారం రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.అనంతరం ఉత్సవమూర్తులను రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీపై కొలువుదీర్చారు.ఆలయామాఢవీధుల్లో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.పల్లకీ సేవలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు కంకణాలు ఉచితంగా అందజేశారు.

విద్యా సంస్థల్లో పరిశుభ్రతకు మార్గదర్శకాలు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పరిశుభ్రతను పాటించడం కోసం విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులకు సోమవారం వీటిని పంపించారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లు, మూత్రశాలలు, దుస్తులు మార్చుకునే గదులు, వాష్‌బేసిన్లు తదితర వాటిని పరిశుభ్రంగా ఉంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్వహణ నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా విద్య, సంక్షేమ సహాయకులు ప్రతి సోమ, గురు వారాల్లో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలి. మరుగుదొడ్లు వంటివి పరిశుభ్రంగా ఉన్నాయో లేవో పరిశీలించి ఫోటోలతోపాటు రిమార్కులను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఐఎంఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన ఈ సర్వే ఫార్మెట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు సాయంత్రం అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అలాగే పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, సభ్యులు ప్రతి బుధ, శుక్రవారాల్లో పాఠశాలలను సందర్శించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని మధ్యాహ్న భోజన పథక డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలను పంపారు.

మిన్నంటిన జూడాల నిరసన



రిలే దీక్షకు మద్దతు తెలిపిన వైద్య విద్యార్థులు (ఇన్‌సెట్) తొలిరోజు దీక్షలో కూర్చున్న జూడాలు

కడప అర్బన్ : కోల్‌కతాలో ఆర్‌జీవీకేఆర్ వైద్య కళాశాలలో పీజీ మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కడప జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కడప రిమ్స్ ఆవరణలో జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో సాగుతున్న నిరసన మిన్నంటింది. సోమవారం జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. ఖదీర్, ఉపాధ్యక్షులు డాక్టర్ జయభారత్‌రెడ్డి, డాక్టర్ అశ్విని, నాయకులు డాక్టర్ ఏ. నిఖిల్ సింగ్ మాట్లాడారు. ప్రాణాలను పణంగా పెట్టి వైద్య వృత్తిని చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతో పాటు, దారుణంగా హత్య చేశారని...అలాంటి మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తొలి రోజు రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులలో ఖాదర్‌బాషా, వైష్ణవి, వేణు, పృథ్వీ, దీపిక, రాహుల్ మహారియా, ప్రియాంక యాదవ్, క్రిల్, శశికిరణ్, అఫ్రీన్, పుడుర్ పవన్, పాయల్ రాజ్ ఉన్నారు. రిమ్స్‌లో జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు పరిపాలన విభాగం నాయకులు రవి, మునీంద్ర, ఇతర ఉద్యోగులు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు సీఐటీయూ నాయకులు మనోహర్, రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ సంఘాల నాయకులు తదితరులు మద్దతు తెలియజేశారు.

చెయ్యేరుపై.. ఇక చెయ్యి వేయలేరు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు



ఇసుక అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ వాహనాలను అడ్డుకుంటున్న నారాయణ నెల్లూరు గ్రామస్తులు

- అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు
- తాజాగా పెనగలూరులో 8 టిప్పర్లతోపాటు లారీ సీజ్

సాక్షి రాయచోటి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అంటూ ఊదరగొడుతోంది. కానీ అధికార పార్టీ నేతలు చెయ్యేరును చెరపట్టి ఎక్కడికక్కడ పిండేస్తున్నారు. గతంలో ప్రభుత్వం పలుచోట్ల ఎంపిక చేసిన రీచ్ పాయింట్ల వద్ద చెలరేగుతున్నారు. పగలైతే అధికారుల కంటపడతామని గ్రహించి రాత్రికి రాత్రే ఇసుకను తోడేస్తున్నారు. ఇటీవలి కాలంలో చెయ్యేరు పరివాహక గ్రామాల్లో ట్రాక్టర్లను కొనుగోలు చేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ సంపాదనకు తెర లేపుతున్నారు. టిప్పర్లు, లారీలతో ఇసుక సరిహద్దులు దాటించేందుకు చెయ్యేరులో జేసీబీతో తోడుతుండగా..నారాయణనెల్లూరు గ్రామస్తులు తిరుగుబాటు చేసి అడ్డుకున్నారు. పోలీసులకు పట్టించారు.

ఇసుకకు చెయ్యేరు నది బంగారు గని లాంటిది. నది చుట్టూ 20 గ్రామాల వరకు ఉన్నాయి. ప్రతిసారి గుంతలు పెట్టినా వరద వచ్చిన సమయంలో ఇసుక కావాల్సినంత రావడంతో తోడుకునే వారికి తోడుకున్నంత అనే చందంగా మారింది. ప్రధానంగా రాజంపేట, పెనగలూరు, నందలూరు ప్రాంతాల్లోని మందరం, ఓబిలి, నారాయణ నెల్లూరు, బాలరాజుపల్లె, మందపల్లె, అత్తిరాల, కోమంతరాజుపురం, ఎంఆర్ పురం, నందలూరు బ్రిడ్జి, పులపుత్తూరు ప్రాంతం, సిద్దవటం పెన్నానది, జ్యోతి, టంగుటూరు తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా చెయ్యేరు నదిలోని ఇసుకను దోచేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పేదలకు రవాణా ఛార్జీలతోపాటు లోడింగ్ ఛార్జీలు తప్ప ఉచితం అంటున్నా సరైన సమయానికి అందడం లేదు. కానీ చెయ్యేరు చుట్టూ ఎక్కడ చూసినా రాత్రి సమయాల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అక్రమార్కులకు అండ

జిల్లాలో యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గతంలో స్టాక్ పాయింట్ల వద్ద నుంచి వందల టన్నుల్లో ఇసుకను తోడేసిన తెలుగు తమ్ముళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులకు పట్టుబడుతున్న వాహనాల విషయంలోనూ పచ్చ రాజకీయం చేస్తున్నారు. నదిలో ఇసుక తరలిస్తూ పట్టుబడిన వాహనాలను విడిపించేందుకు అక్రమార్కులకు అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నారు. అధికారం వచ్చిన రెండు నెలల్లోనే ఎక్కడపడితే అక్కడ అవకాశం ఉన్నంత మేరకు ఇసుక దోపిడీతో దండుకోవాలని చూస్తుండడంపై ప్రజలు తిరగబడుతున్నారు.

గ్రామస్తుల ఆగ్రహం

పెనగలూరు మండలంలోని నారాయణ నెల్లూరు సమీపంలోని చెయ్యేరు నదిలో ఇసుకను రాత్రికి రాత్రే తరలించేందుకు నదిలోకి వెళ్లగా గ్రామస్తులు పనిగట్టుకుని కనిపెట్టి తిరగబడ్డారు. ఆదివారం అర్ధ రాత్రి ప్రాంతంలో వచ్చిన లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లను బయటికి వెళ్లకుండా అడ్డుకుని పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. ఎక్కడా ఇసుక అక్రమంగా పోలేదని ప్రభుత్వం చెబుతున్న తరుణంలో నారాయణ నెల్లూరులో జనాలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. అక్రమార్కులు తరలించుకుపోతున్నా మీరేం చేస్తున్నారంటూ గ్రామస్తులు అక్కడికి వచ్చిన అధికారులను నిలదీశారు. అక్కడ 8 టిప్పర్లతోపాటు ఒక లారీ, పలు ట్రాక్టర్లను పట్టుకుని వాహనాలను సీజ్ చేశారన్న విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు నందలూరు మండలంలోని టంగుటూరు, రాజంపేట ప్రాంతంలోని పలుచోట్ల రాత్రిళ్లు తిరిగే టిప్పర్లను రహస్య ప్రాంతాలకు తరలించినట్లు తెలియవచ్చింది. ఏది ఏమైనా ప్రజల్లో చైతన్యం రావడంతో ఇసుకాసురులు సైతం నదిలోకి వెళ్లాలంటే జంకుతున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ శివశంకర్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : అర్జీదారుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వినతుల్లో కొన్ని..

- పోరుమామిళ్ల మండలం నర్సింగ్ కొట్టాలు గ్రామానికి చెందిన సమత తమ గ్రామంలో అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉందని, సదరు పోస్టుకు తను అర్హురాలిని అని, తనకు మంజూరు చేయాలని కోరారు.
- తమ కాలనీ నుంచి నాగలకట్ట వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా, అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి ఒకరు అక్రమ లే అవుట్ వేసి తమకు అన్యాయం చేస్తున్నారని జమ్మలమడుగు మండలం ఎస్సీ కాలనీకి చెందిన ఎం .ఆంజనేయులు ఫిర్యాదు చేశారు.
- గూడూరు గ్రామం పొలంలోని 1.25 ఎకరాల తన పట్టా భూమిని రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా చూపారని, తనకు న్యాయం చేయాలని కడప ఎంఆర్ స్ట్రీట్‌కు చెందిన ఖాజాబాషా కోరారు.
- ఇండియన్ ఆర్మీలో సర్వీసు పూర్తి చేసుకున్న తనకు ప్రభుత్వం వ్యవసాయ భూమి మంజూరు చేయాలని మైదుకూరు పెద్దమ్మ స్ట్రీట్‌కు చెందిన గవాస్కర్ కోరారు.
- వీఎన్ పల్లె మండలం ఇందుకూరుకు చెందిన రైతు లక్ష్మిరెడ్డి జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు-2 కాలువ భూసేకరణలో తన వ్యవసాయ భూమి పోయిందని.. నష్టపరిహారం అందించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు.
- సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన రమణమ్మ, వేణుగోపాల్ తమ ఊరు మునక ప్రాంతం అని, లోమడ చెరువులో తమ భూములు మునిగిపోయాయని నష్టపరిహారం అందించడంలో ఎవరూ పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు.

క్లుప్తంగా

స్థలం సమస్యపై నాయకుల మధ్య ఘర్షణ

ముద్దనూరు : మండల కేంద్రంలో కడప రహదారిలోని ఓ స్థలం సమస్యపై ఇరుపార్టీలకు చెందిన ముఖ్య నాయకుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ మునిరాజారెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకుడు అలీషేర్‌లు స్థలం విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలకు చెందిన వారు కాసేపు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఘర్షణ సద్దుమణిగింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి



సయ్యద్ ఇమ్రాన్ మృతదేహం

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని బోడెద్దులపల్లి గ్రామంలో నివాసముంటున్న సయ్యద్ ఇమ్రాన్ (37) అనే వ్యక్తి సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సయ్యద్ ఇమ్రాన్ బోడెద్దులపల్లి గ్రామానికి సంబంధించిన వ్యక్తి కాగా కూలిపనుల నిమిత్తం సోమవారం గుడావాండ్లపల్లి గ్రామంలో రేకులను బిగించేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులతోపాటు భార్య ఉన్నారని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత



అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని పాపాఘ్ని నగర్ (కట్ట బస్టాపు) వద్ద సోమవారం తెల్లవారుజామున 4 ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సంజీవ రాయుడు తెలిపారు. తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను లోడు చేసుకుని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లపై తదుపరి చర్యల కోసం రెవెన్యూ అధికారులకు నివేదించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విత్తన వడ్లకు రెక్కలు



- బస్తాకు రూ.800 పెరుగుదల
- నాసిరకం విత్తనాలతో అపార నష్టం
- అధికారుల పర్యవేక్షణ లోపం



కొక్కరాయపల్లెలో నాగయ్య పొలంలో మొలకెత్తని నారు

ఖాజీపేట : వరుణ దేవుడు మనపై కరుణ చూపలేదు.. అయినా ఎగువన భారీగా వర్షాలు కురవడంతో సకాలంలో కాలువకు నీరు వచ్చింది. రైతులు ఆనందంగా పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే విత్తన వడ్లకు డిమాండ్ పెరగడంతో కంపెనీలు అమాంతం ధరలు పెంచి రైతుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నాయి. ధర పెరిగినా ఫర్వాలేదు అనుకుంటే నాసిరకం విత్తనాలు రైతులకు అందించి తీవ్రంగా నష్టపోయేలా చేస్తున్నారు.

కేసీ కెనాల్ పరిధిలో అధిక భాగం రైతులు వరి సాగు చేస్తారు. ముఖ్యంగా కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని ఖాజీపేట, మైదుకూరు, చాపాడు, దువ్వూరు మండలాల్లో అధికంగా, మిగిలిన చోట తక్కువ భాగం వరి సాగు అవుతుంది. అందుకే దీనిని మరో కోనసీమగా పిలుస్తుంటారు. కేసీ కాలువకు సకాలంలో నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు అందరూ వరి సాగుకు సిద్ధమయ్యారు.

విత్తన వడ్లకు డిమాండ్

శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాంకు నీరు పుష్కలంగా రావడం.. సకాలంలో నీటిని విడుదల చేయడంతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో రైతులందరూ ఒకే సారి వరి సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో ఎప్పుడూ లేనంతగా విత్తన వడ్లకు డిమాండ్ అధికమైంది. కంపెనీలు అమాంతం ధరలు పెంచి రైతుల నుంచి ముక్కు పిండి అధిక ధరలు వసూలు చేస్తున్నాయి.

వడ్ల బస్తా 30 కేజీలు రూ.1000 ఉంటే అది నేడు మార్కెట్‌లో రూ.1800 నుంచి రూ.2000 వరకు అమ్ముతున్నారు. అదేమని దుకాణదారులను అడిగితే కంపెనీలు అమాంతం ధరలు పెంచాయి. మేము నామమాత్రం ఆదాయం బస్తాకు రూ.50 పెట్టుకుని రైతులకు అమ్ముతున్నాం అని విత్తన వ్యాపారులు అంటున్నారు. దీంతో రైతుల అవసరాల దృష్ట్యా విధిలేని పరిస్థితుల్లో రైతులు అధిక ధరలు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

నాసిరకం విత్తనాలతో రైతులకు కష్టం

విత్తన వడ్లకు డిమాండ్ అమాంతం పెరగడంతో కంపెనీల నుంచి నాసిరకం విత్తనాలు రైతులకు వస్తున్నాయి. కంపెనీల వద్ద సరైన నాణ్యత పరీక్షలు లేకుండానే విత్తనాలు డీలర్లకు సరఫరా చేస్తున్నారు. తమ వద్ద ఉన్న విత్తనాలను అమ్మగా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. అలా చేసిన వడ్లను ఎలాంటి ప్రాసెసింగ్ చేయకుండానే రైతులకు విత్తన వడ్ల రూపంలో అమ్ముతున్నారు. కంపెనీలపై నమ్మకంతో రైతులు తీసుకుని నారు పోసుకుంటున్నారు. అయితే వాస్తవానికి ఎకరా పొలంలో రెండు బస్తాలు నారు పోయగా అందులో సగం కూడా మొలకలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. మరి కొందరికి మొలక శాతం తక్కువగా వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీటిని సాగు చేస్తే సరైన దిగుబడి వస్తుందా.. రాదా అని అయోమయంలో ఉన్నారు.

కొరవడిన పర్యవేక్షణ

రైతులకు అందించే విత్తనాల విషయంలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. విత్తనాలను పూర్తిగా పరీక్షించే అధికారం వ్యవసాయ శాఖ అధికారులకు ఉంది. ఏదైనా అనుమానం ఉంటే అమ్మకాలను పూర్తిగా నిలుపుదల చేసే అధికారం కూడా ఉంది. బ్యాచ్ నుంచి 100 వడ్లను తీసుకుని అధికారులు పరీక్షలు నిర్వహించవచ్చు. సరైన మొలక శాతం రాకపోతే కంపెనీ, డీలర్‌పై చర్యలు తీసుకునే అధికారం ఉంది. అయితే ఫర్టిలైజర్, విత్తన దుకాణాలు తనిఖీ చేసే ముందు అధికారులు ముందస్తు సమాచారం ఇస్తున్నారు. దీంతో వారు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా తనిఖీలు నామ్‌కే వాస్తే అన్నట్లుగా సాగుతున్నాయి.

మొలక శాతం పరిశీలించుకోండి

విత్తన వడ్లు తీసుకున్న రైతులు మొలక శాతం పరిశీలించుకున్న తర్వాతనే నారుకు సిద్ధం కావాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. తీసుకున్న విత్తనంలో వంద వడ్లను మడి కట్టుకుని పరిశీలించాలంటున్నారు. అందులో మొలక శాతం పరిశీలించాలని చెబుతున్నారు. సక్రమంగా మొలక శాతం రాకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలంటున్నారు.

శాంపిల్స్ తీసుకున్నాం

విత్తన దుకాణాల వద్ద వచ్చిన బ్యాచ్‌ల నుంచి సుమారు 12 శాంపిల్స్ తీసుకున్నాం. రిపోర్టు రావాల్సి ఉంది. వచ్చిన తరువాత పరిశీలిస్తాం. సక్రమంగా లేకపోతే వ్యవసాయ శాఖ పరంగా చర్యలు ఉంటాయి.

\- నాగార్జున, వ్యవసాయాధికారి

అధిక ధరకు అమ్ముతున్నారు

విత్తనాల ధరలు అమాంతం పెరిగాయి. రూ.1000 ఉండే బస్తా నేడు రూ.1800 కు అమ్ముతున్నారు. అదేమంటే డిమాండ్ కారణంగా ధరలు పెరిగాయని అంటున్నారు. కొంటే కొనండి లేక పోతే లేదు అంటున్నారు.

\- రమణ, రైతు, చెర్లోపల్లి

మొలక శాతం సక్రమంగా రావడం లేదు

ఖాజీపేటలో విత్తన వడ్లు కొనుగోలు చేశాను. ఎకరాకు రెండు బస్తా వడ్లు వేశాను. అందులో ఐదు వడ్లకు గాను ఒకటి మొలక శాతం వచ్చింది. పంట సాగు చేస్తే దిగుబడి వస్తుందో లేదో అర్థం కావడం లేదు.

\- నాగయ్య, రైతు, కొక్కరాయపల్లె

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

వేంపల్లె : వేంపల్లె మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన బందలకుంట దేవి అనే మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వేంపల్లె శ్రీరామ్ నగర్‌కు చెందిన గంగాధర్‌తో దేవి వివాహం జరిగింది. అయితే దేవి పేరుమీద ఉన్న ఇంటిని అమ్మాలని ఆమె భర్త ప్రతిరోజు శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై ఆదివారం రాత్రి గొడవ పడినట్లు పోలీసులు తెలిపారు. ఆమె భర్త గంగాధర్ కట్టెతో కొట్టగా దేవి కుడిచేయి వద్ద గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ నిధులు స్వాహా

పంచాయతీ కార్యదర్శి అరెస్టు

ముద్దనూరు : ప్రభుత్వ నిధులను స్వాహా చేసి తన సొంత అవసరాలకు వినియోగించుకున్నాడనే కేసుపై మండలంలోని ఉప్పలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రెహమాన్ (ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఆరవేటిపల్లె నుంచి చింతకుంట వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణానికి అప్పట్లో సుమారు రూ.6లక్షల 68వేలు నిధులు మంజూరయ్యాయి. అప్పటి కార్యదర్శి రెహమాన్ తన ఖాతాల్లో నుంచి ఈ నిధులను డ్రా చేసుకుని కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా స్వాహా చేశాడు. ఈ మేరకు 2024 ఫిబ్రవరి 29వ తేదీన అప్పటి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూర్యనారాయణరెడ్డి విచారణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

విశాఖ, శ్రీకాకుళం జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం



147 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ చరణ్‌జీత్



5 వికెట్లు తీసిన శ్రీకాకుళం బౌలర్ పూర్ణ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహించిన ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 49 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 86 ఓవర్లలో 356 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని చరణ్‌జీత్ 147 పరుగులు, వరుణ్ 76 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 5 వికెట్లు, సాయి సుజన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. జట్టులోని సాయి సుజన్ 37 పరుగులు, థామస్ రామ్‌కుమార్ 31 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 4 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు 356 పరుగులు చేయగా, చిత్తూరు జట్టు 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 394 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 111.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 431 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని పరమ్‌వీర్ సింగ్ 155 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ధీరజ్ 1, కుల్లాయప్ప 1, రోహిత్ 1, ప్రణవ్ 1 చొప్పున వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 46.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. జట్టులోని ప్రణవ్‌కుమార్‌రెడ్డి 60, లోచన్‌రాజు 52 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు రచిత్ 3, రోహిత్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 206 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో విశాఖ..

కాగా ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 టోర్నమెంట్ గ్రూప్–బిలో విశాఖ జట్టు పాయింట్ల పట్టికలో 25 పాయింట్ల అగ్రస్థానంలో నిలిచింది. కృష్ణా జట్టు 23 పాయింట్లతో రెండోస్థానంలోను, 16 పాయింట్లతో పశ్చిమగోదావరి మూడో స్థానంలో నిలిచాయి. ఆతిథ్య కడప జట్టు 12 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కడప అర్బన్: కడప నగరం రాజంపేట రోడ్డులోని రింగ్ రోడ్డు సర్కిల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రిమ్స్ పీఎస్ సీఐ సీతారామరెడ్డి తెలిపారు. రామకృష్ణనగర్‌కు చెందిన రమేష్ నాయక్ (35) బేల్దారిపని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతునికి మద్యం తాగే అలవాటు ఉందని, ఆదివారం రాత్రి తాను సంఘటన స్థలంలోకి వెళ్లి మద్యం మత్తులో పడిపోయాడా? లేక అనారోగ్యంతో అస్వస్థతకు గురై మరణించాడా? అనే విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి



బొగ్గుల వెంకటసుబ్బారెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి రాజశేఖర్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్‌గా బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వైఎస్సార్‌సీపీ తరపున ఉన్న చైర్మన్ యెల్లాల కుమార్‌రెడ్డి ఇటీవల రాజీనామా చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి రాజశేఖర్ సోమవారం ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ స్థానానికి సుబ్బారెడ్డి మాత్రమే నామినేషన్ వేయడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టౌన్ బ్యాంక్‌కు సంబంధించి మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లతోపాటు టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, వీఎస్ ముక్తియార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన అనంతరం టౌన్ బ్యాంక్ చైర్మన్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సుబ్బారెడ్డి తన పదవీ కాలంలో బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి

పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఆదేశం



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

సులభతరంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు

ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎస్. రమణ

కడప కార్పొరేషన్ : జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సులభతరంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్‌కు రూ.70వేలు, 2 కిలోవాట్లకు రూ.1.40లక్షలు, 3 కిలోవాట్లకు రూ.2.10లక్షలు ఖర్చు అవుతుందన్నారు. కానీ పీఎంఎస్‌జీవై పథకం ద్వారా ఒక కిలోవాట్ తీసుకున్నవారికి రూ.30 వేలు, రెండు కిలోవాట్లు తీసుకున్నవారికి రూ.60 వేలు, మూడు కిలోవాట్లు తీసుకున్న వారికి రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకునేలా అధికారులు ప్రచారం చేయాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు రూ.120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దీని ద్వారా ప్రస్తుతం నెలకు రూ.1000 వచ్చే బిల్లు సోలార్ ఏర్పాటు చేసుకున్న తర్వాత సుమారు 338 రూపాయలు తగ్గుతుందన్నారు. సంవత్సరానికి రూ.8వేలు ఆదా అవుతుందన్నారు. రెండు కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసుకుంటే సంవత్సరానికి రూ.20వేలు, మూడు కిలోవాట్లతో ఏర్పాటు చేసుకుంటే రూ.32400 ఆదా అవుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి వైయస్సార్ జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఒంటిమిట్ట రామయ్య పౌర్ణమి కల్యాణం



మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సీతారాములకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు ఆశీనులు చేసి, ప్రత్యేక అలంకరణ కావించి కల్యాణ తంతును అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం నుంచి సోమవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

ఎండకు బెదిరి..చెట్టు కిందకు చేరి.!

వర్షాకాలంలో ఎండలు చాలా తక్కువగా ఉండి చలి ఎక్కువగా పెడుతూ ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా ఈ ఏడాది ఎండలు ఎక్కువగా పెట్టడంతో మనుషులతో పాటు గొర్రెలు, మేకలు, పశువులు సైతం తట్టుకోలేక పోతున్నాయి. అలాగే ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో పంటలు కూడా ఎండుముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో ఎండవేడిమి తట్టుకోలేక వెంగలాయపల్లె–పగిడాల గ్రామాల మధ్యలో సోమవారం వేపచెట్ల కింద గొర్రెలు, మేకలు సేదతీరుతున్న దృశ్యం కనిపించింది.

\- రాజుపాళెం



నా భర్త ఆచూకీ తెలపండి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన భార్య, కుమారుడు



తన భర్త ఆచూకీ తెలియజేయాలన్ని కోరుతున్న భార్య వెంకటసుబ్బమ్మ, కుమారుడు భాస్కరాచారి

కడప అర్బన్ : 'సార్.. నా భర్త ఈశ్వరాచారి కనిపించక రెండేళ్లవుతోంది... పోలీసులు ఎవరూ పట్టించుకోలేదు' అంటూ పి. వెంకటసుబ్బమ్మ, ఆమె కుమారుడు భాస్కరాచారిలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడపలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన బాధితులు తమ భర్తను ఊరివాళ్లే కొట్టుకుంటూ కొండపైకి తీసుకుని వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలం అద్దాలమర్రి గ్రామంలో నివాసం ఉంటున్న తన భర్త ఈశ్వరాచారి కొందరు గ్రామస్తులు కొండపైన సారాయి కాస్తున్నారని పోలీసులకు సమాచారం అందిస్తున్నాడని ఆగ్రహంగా ఉండేవారన్నారు. ఈ నెపంతో తన భర్తపై ఓ మహిళను ఉసిగొల్పి దాడికి పాల్పడ్డారన్నారు. అదే గ్రామానికి చెందిన బి.మల్లికార్జున రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో పాటు కె. నాగేశ్వర్‌రెడ్డి, సిద్దారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరికొంతమంది కలిసి 2022 సెప్టెంబర్ 1న దాడి చేసి గ్రామానికి దగ్గరలోని కొండపైకి తరుముకుంటూ తీసుకుని వెళ్లారని ఆరోపించారు. తరువాత తన భర్త ఆచూకీ తెలియరాలేదన్నారు. ఆ సమయంలో చక్రాయపేట ఎస్ఐగా వున్న మల్లికార్జునరెడ్డి కేవలం అదృశ్యం కేసును నమోదు చేసి తరువాత పట్టించుకోలేదన్నారు. తన భర్తను వారంతా కలిసి చంపేసి ఎక్కడో పడేశారని గ్రామస్తులంతా అనుకుంటున్నారని తెలిపారు. తన భర్త ఆచూకీ తెలపాలని, లేదంటే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కారుకు నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



కాలిపోయిన కారును చూపిస్తున్న బాధితుడు కరుణాకర్‌రెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య స్కూల్ ప్రాంతంలో కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ మేరకు సోమవారం బాధితుడు కరుణాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరపునాయునిపల్లె మండలం ఎర్రమలపల్లె గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి తన సొంత పనుల నిమిత్తం వేంపల్లెకు వచ్చారు. చైతన్య స్కూల్ ఏరియాలో తన కారును పార్కు చేసిన ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కారు వెనుక భాగాన నిప్పంటించారు. దీంతో అతని బెలానో కారు సగ భాగం కాలిపోయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. ఘటన జరిగిన సమీపంలో సీసీ టీవీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.